రోడ్లపై చెత్త కుప్పలు.. దోమల వృద్ధి

● దుర్వాసనతో ప్రజల ఇబ్బంది
● రోగాల బారిన పడుతున్న వైనం



ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండడం, రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు వృద్ధి చెందుతుండడంతో డెంగీ, మలేరియా వంటి జ్వరాల బారిన పడుతున్నారు. స్వచ్ఛ ఆటోలు ఇళ్ల వద్దకు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు చెత్తా చెదారాన్ని రోడ్లపై పారేస్తున్నారు. రోజుల తరబడి తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో కొన్ని ప్రాంతాలలో చెత్త సమస్యతోపాటు మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో దోమలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గంలో..

రాంనగర్ నుంచి వీఎస్టీకి వెళ్లే రహదారిలో మురుగునీరు రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ సమస్య కొంతకాలం నుంచి ఉంది. వీఎస్టీ కంపెనీ రోడ్డులో రోడ్డుపై చెత్తకుప్పలు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారింది. కవాడిగూడ డివిజన్ బీమా మైదాన్‌లో ఇళ్ల మధ్యలో రోజుల తరబడి చెత్త నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఎల్ఐసీ కాలనీ, ఎన్టీఆర్ స్టేడియం, గుడాల బస్తీ సమీపంలో రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు.



బీమా మైదాన్ వాంబే కాలనీలో ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తాచెదారం



ఎల్ఐసీ కాలనీ వద్ద రోడ్డు పక్కన చెత్తాచెదారం

అంబర్‌పేట నియోజకవర్గంలో..

అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో ఐదు మునిసిపల్ డివిజన్‌లలో రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వస్తుండడంతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. పటేల్ నగర్ చౌరస్తా, బాపునగర్, చెన్నారెడ్డినగర్, దుర్గానగర్, అన్నపూర్ణనగర్, గోల్నాక నూతన బ్రిడ్జి పక్కన, గోల్నాక కల్లుకాంపౌండ్ పక్కన, తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి, కాచిగూడ రైల్వే స్టేషన్ వెనక, అక్వాహోటల్ చౌరస్తా, సుందర్‌నగర్, కాచిగూడ ఆర్టీసిడిపో సమీపంలో, కుద్బిగూడ మోతీమార్కెట్, విద్యానగర్ రైల్వే స్టేషన్ రోడ్డు, బాగ్ అంబర్‌పేట ప్రభుత్వ బాలికల పాఠశాల పక్కన, బతుకమ్మకుంట, పోచమ్మ బస్తీ తదితర ప్రాంతాలలో చెత్త సమస్య తీవ్రంగా ఉంది. చెత్త కుప్పలు పేరుకుపోతుండడంతో దోమలకు నిలయంగా మారుతోంది.




కాచిగూడ కుద్బిగూడ, రైల్వే స్టేషన్ రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలు



అజామాబాద్ వీఎస్టీ కంపెనీ సమీపంలో చెత్తాచెదారం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉండాలి

● బీజేపీ నాయకులకు ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ పిలుపు

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముందు వరుసలో ఉండాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాతిరి పార్థసారథి ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం చౌరస్తాలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని లక్ష్మణ్ ప్రారంభించారు. బీజేపీ నాయకులు కలకోట అరుణ్‌కుమార్, జైపాల్‌రెడ్డి, భరత్‌గౌడ్, పూసరాజు, జనార్దన్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు

ముషీరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఏఎన్ఎం లక్ష్మీబాయి అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల కోసం బోయిగూడకు చెందిన విశాల్, కీర్తన దంపతులు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సువర్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల కోసం నోటు పుస్తకాలు అందజేసిన విశాల్, కీర్తన దంపతులు

బీఆర్ఎస్‌ను వీడేవారికి పుట్టగతులుండవు

ముషీరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు పదవులను అనుభవించి అధికారంలో లేని సమయంలో పార్టీలు మారే బీఆర్ఎస్ నాయకులకు పుట్టగతులు ఉండవని భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వార్థ రాజకీయ లబ్ధికోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ మారుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు వంగాల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అప్నా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ హజారే అన్నారు. టెక్ మహీంద్రా ఫౌండేషన్, అప్నా స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో టెక్ మహీంద్రా స్మార్ట్ ఉపాధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రాంనగర్ ఈసేవ వద్ద శుక్రవారం నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉపాధి నైపుణ్య కోర్సుల్లో శిక్షణకు నిరుద్యోగ యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడ్వాన్స్డ్ ఎక్సెల్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ టైపింగ్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. గాంధీ ఆస్పత్రి ఎదురుగాగల అప్నా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ శిక్షణ కేంద్రానికి వచ్చి లేదా 9154990135 నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

నల్లకుంట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు(ఆహార భద్రత) మంజూరు చేయాలని నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ యాకర అమృత డిమాండ్ చేశారు. శుక్రవారం అంబర్‌పేట సర్కిల్ ఏఎస్ఓ దీప్తిని కలిసి రేషన్ కార్డుల మంజూరు విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. దీంతో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు రేషన్ కార్డులు లేక రేషన్ షాపుల్లో నిత్యావసరాల సరుకులు అందుకోలేక పోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో దళిత మోర్చా నాయకులు పాల్గొన్నారు.




ఏఎస్ఓతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

గాంధీనగర్‌లో రోడ్లపై గుంతల పూడ్చివేత

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో రోడ్లపై గుంతలకు జీహెచ్ఎంసీ అధికారులు మరమ్మతులు చేశారు. రోడ్లపై గుంతలతో ప్రజలు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో కార్పొరేటర్ పావని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం గుంతలను పూడ్చివేశారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ అబ్దుల్‌సలామ్, మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పనులను పర్యవేక్షించారు.



రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న సిబ్బంది



మాట్లాడుతున్న మధుసూదనాచారి

ఆంగ్లనాటక స్థాయిలో ఇనాక్ నాటకాలు

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇనాక్ తెలుగు నాటకాలు షేక్స్పియర్ ఆంగ్లనాటక స్థాయిలో ఉంటాయని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా శుక్రవారం ఇనాక్ నాటక రచనపై ప్రసంగ కార్యక్రమం జరిగింది. మధుసూదనాచారి మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా ప్రతికూల వాతావరణంలో తనను తాను తీర్చిదిద్దుకున్న శిల్పి ఇనాక్ అని అన్నారు.

ప్రముఖ నాటక రచయిత ప్రయోక్త పాటిబండ్ల ఆనందరావు కీలకప్రసంగం చేస్తూ.. వర్తమాన సమాజానికి దారి, దీపం చూపని రచనలు వ్యర్థం అన్న ఆలోచన ఇనాక్ తన ప్రతి నాటకంలో నిర్భయంగా తెలిపారని విశ్లేషించారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా. నాళేశ్వరం శంకరం మాట్లాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, కార్యవర్గసభ్యులు జంగంరావుగౌడ్, ప్రసాద్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

'స్వామివివేకానందనగర్ వాసులకు న్యాయం చేస్తాం'

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందనగర్ వాసులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, గుర్రం శంకర్, గుండు జగదీశ్‌బాబు, బాబీ(సాయికీర్త్)లు పేర్కొన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

చిక్కడపల్లిలో గ్రంథాలయం వద్ద పోలీసు బందోబస్తు

● నిరుద్యోగులు టీజీపీఎస్సీ ముట్టడికి వెళ్లకుండా..

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు టీజీపీఎస్సీని శుక్రవారం ముట్టడించాలని నిర్ణయించడంతో చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ, ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో పోలీసు బందోబస్తు నిర్వహించారు. పదిహేను రోజుల నుంచి గ్రంథాలయ ఆవరణలో నిరుద్యోగులు ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం గ్రంథాలయం నుంచి వందలాదిమంది నిరుద్యోగులు టీజీపీఎస్సీ ముట్టడికి బయలుదేరతారనే సమాచారంతో తెల్లవారు జాము నుంచే పోలీసులు బందోబస్తు నిర్వహించారు. టీజీపీఎస్సీ ముట్టడికి వెళ్లకుండా వారిని అదుపులోకి తీసుకునేందుకు వాహనాలను సిద్ధంగా ఉంచారు.



గ్రంథాలయం వద్ద పోలీసు బందోబస్తు

పోలీసుల అదుపులో నలుగురు

టీజీఎస్సీ ముట్టడికి వెళ్లిన నలుగురు నిరుద్యోగులను అదుపులోకి తీసుకున్నామని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలి

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు, పద్మశ్రీ డాక్టర్ ఎ. గోపాలకృష్ణ గోఖలే అన్నారు. గుండెపోటు రావడానికి కారణం శారీరక వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి అని అన్నారు. శుక్రవారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అందరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. డా. గోపాలకృష్ణ గోఖలే మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనం కోసం మితంగా ఆహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణగోఖలే, ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వివేక్, వెంకటస్వామిగౌడ్, బీఆర్ఎస్ నాయకులు బబ్లూ, దామోదర్‌రెడ్డి, మురళీప్రసాద్, కందూరి కృష్ణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్, పద్మశ్రీ డాక్టర్ ఎ. గోపాలకృష్ణ గోఖలేను సత్కరించిన వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ప్రతినిధులు

వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాంనగర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సేవా సమితి అధ్యక్షుడు వాడకట్టు రాజు, ప్రధాన కార్యదర్శి చల్లా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌నగర్‌లో..

చిక్కడపల్లి:వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా, యూబీఐ లేబర్ కమిషనర్ బ్రాంచ్ హెడ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



రాంనగర్ చౌరస్తాలో అన్నదానం చేస్తున్న వాసవీ సేవా సమితి సభ్యులు

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● రైతు స్వరాజ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 22 లక్షలకుపైగా ఉన్న కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు వక్తలు కోరారు. రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం 'తెలంగాణలో కౌలు రైతుల గుర్తింపు-రైతు భరోసా' అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రైతు భరోసా ఏ విధంగా ఇవ్వాలనే దానిపై కేబినెట్ కమిటీ చర్చిస్తుందని తెలిపారు. అధికారులు గ్రామసభ ద్వారా కౌలు రైతులను గుర్తించే అవకాశాలున్నాయన్నారు. ఇటీవల నలుగురు రైతులు కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకున్నారని, ఖమ్మంలో రైతు ఆత్మహత్య వెనుక బీఆర్ఎస్ నేతల ప్రమేయముందని ఆరోపించారు. రైతు స్వరాజ్య వేదిక నేత కన్నెగంటి రవి మాట్లాడుతూ.. కౌలు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసాపై ఇటీవల జిల్లా, మండల స్థాయిల్లో సమావేశాలు జరుపుతున్నా.. కౌలు రైతుల ప్రస్తావన రావడంలేదన్నారు. కౌలు రైతులకు న్యాయం చేయాలని పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు వి.సంధ్య అన్నారు. సమావేశంలో పలువురు కౌలు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కౌలుకు చేస్తూ అప్పుల పాలై తన భర్త చనిపోయాడని, ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సాయంలేదని వికారాబాద్ జిల్లాకు చెందిన మంజుల తెలిపారు. ఎకరాకు రూ.15వేలు చెల్లించి కౌలుకు చేస్తే అప్పులే మిగులుతున్నాయని ఆదిలాబాద్ జిల్లా కౌలు రైతు మల్కన్న అన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన కౌలు రైతులు తమ కష్టాలను వివరించారు. కౌలు రైతులు అంతకుముందు బేగంపేటలోని ప్రజాభవన్‌లో ప్రజావాణికి వెళ్లి ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, నోడల్ ఆఫీసర్ దివ్యకు రైతు భరోసా, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విన్నవించారు.

'బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి'

కవాడిగూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ జనరల్ రాంచంద్రారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు కె. అనిల్‌కుమార్, బాణాల రాఘవ కోరారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బడ్జెట్ పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన వారిలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కె. రామేశ్వర్‌రెడ్డి, వివిధ జిల్లాల ఉపాధ్యక్షులు జయరాం ప్రసాద్, ఆంజనేయులు. శేఖర్‌చారి పాల్గొన్నారు.

కనులపండుగగా శతకలశాభిషేకం

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీదేవాలయం ఆవరణలోని శివాలయంలో కనులపండుగగా శతకలశాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈవో లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మోటివేషనల్ స్పీకర్ వాహనంలో మంటలు

అంబర్‌పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ షఫీ ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. శుక్రవారం రాత్రి అంబర్‌పేట మీదుగా వెళ్తోన్న ఆయన వాహనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన షఫీ, డ్రైవర్ వెంటనే బయటకు దిగడంతో ప్రాణాపాయం తప్పింది. అంబర్‌పేట సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మసాబ్‌ట్యాంక్‌లో నివసిస్తున్న షఫీ శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో టాటా సఫారీ వాహనంలో అంబర్‌పేట వైపు వచ్చాడు. చే నెంబర్ చౌరస్తా సమీపంలో వాహనం నుంచి మంటలు చెలరేగడంతో ఆయనతోపాటు డ్రైవర్ కిందకు దిగారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. అంబర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాలిపోతున్న కారు

రేపు జగన్నాథ రథయాత్ర

నల్లకుంట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు జగన్నాథ రథ యాత్ర నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు హెచ్‌జీ మహాప్రింగ్ దాస్ తెలిపారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రథయాత్రలో అమెరికా, దక్షిణాఫ్రికా, రష్యా, ఉక్రెయిన్ నుంచి 12 మంది బృందం పాల్గొంటుందని పేర్కొన్నారు. రథయాత్ర హైదర్‌నగర్‌లో భ్రమరాంబిక మల్లికార్జున గార్డెన్ నుంచి ప్రారంభమై కూకట్‌పల్లి జేఎన్‌టీయూ, వివేకానంద విగ్రహం మెయిన్‌రోడ్డు, మెట్రో షాపింగ్‌మాల్, హుడా ట్రక్ పార్కింగ్ వరకు సాగుతుందని తెలిపారు. 9వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో చప్పన్ భోగ్, కీర్తన, మహా హారతి, నృత్య కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ ప్రతినిధులు అంజనీకుమార్ ఆగర్వాల్, పురుషోత్తమ్ ఆగర్వాల్, ఓక్సనా, దేవరూప దేవిదాస్, అంజనీదేవి పాల్గొన్నారు.

గుడికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

● మూడు తులాల బంగారం, రూ. 10 వేలు అపహరణ

అంబర్‌పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుడికి వెళ్లొచ్చేసరికి ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మూడు తులాల బంగారం, రూ. 10 వేలు అపహరించారు. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివసిస్తున్న ఉపేందర్‌రెడ్డి హోంగార్డుగా పనిచేస్తున్నాడు. అతడు శుక్రవారం డ్యూటీ వెళ్లాడు. భార్య శిరీష ఇద్దరు పిల్లలను స్కూల్‌కు పంపించి ఆమె ఫలక్‌నుమాలో అమ్మవారి దేవాలయానికి వెళ్లింది. శిరీష మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన మూడు తులాల బంగారం, రూ. 10 వేలు కనిపించలేదు. చోరీ అయ్యాయని అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీ బస్సు, ఆటో సీజ్

బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ట్రాఫిక్ పోలీసుల శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాలలు, పాఠశాలల బస్సులు, ఆటోలను బర్కత్‌పుర చౌరస్తా వద్ద ట్రాఫిక్ సీఐ ఎ. శ్రీనివాస్, ఏఎంవీఐ రజని ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ లేని ఓ కళాశాల బస్సు, లైసెన్స్ లేకుండా స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న ఆటోను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ.. మైనర్లు ఆటోలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా స్కూల్ పిల్లలను ఆటోలో తీసుకెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జకీర్ హుస్సేన్, కానిస్టేబుల్ విజయుడు, హోంగార్డులు బాల్‌రాజ్, భిక్షం, రాంరెడ్డి, జమాలుద్దీన్,విష్ణు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కవాడిగూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇంటినుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైంది. డీబీఆర్ మిల్స్ మోతీలాల్‌నెహ్రూనగర్‌లో ఓకేల్ కామత్, ప్రమీలాదేవి దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఐదుగురు సంతానం. మూడో కుమార్తె కె. సుమాంజలి(15) పదో తరగతి ఫెయిలయి ఇంట్లోనే ఉంటోంది. బాలిక ఈనెల 3వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి ప్రమీలాదేవి దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సుమాంజలి

నాలాలో పడిపోయిన కూలీ..కాపాడిన పోలీసులు

బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నాలాలో పడిపోయాడు. పోలీసులు అతడిని కాపాడారు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట చెన్నారెడ్డినగర్‌లో నివసిస్తున్న సయ్యద్ సాదిక్(50) కూలి పనిచేసుకొని జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో పనికోసం చాదర్‌ఘాట్ వైపు వెళ్తూ శ్యామ్‌నగర్ నాలా వద్ద బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారీ నాలాలో పడిపోయాడు. సమీపంలో ఉన్న బస్తీ వాసులు కేకలు వేయగా అదే సమయంలో ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్ ప్రదీప్, సిద్దయ్య నాలాలో దిగి అతడిని బయటకు తీసుకొచ్చి కుమారుడికి అప్పగించారు. సాదిక్ కాలికి గాయాలయ్యాయి. సాదిక్ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లను ఏసీపీ రఘు అభినందించారు.

అందుబాటులోకి అశోక్‌నగర్ బ్రిడ్జి అదనపు రోడ్డు

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ బ్రిడ్జిని వెడల్పు చేస్తూ ఏర్పాటు చేసిన అదనపు రోడ్డు అందుబాటులోకి వచ్చింది. వీఎస్టీ నుంచి ఇందిరాపార్కు వరకు స్టీల్ బ్రిడ్జి ఏర్పాటు చేసిన క్రమంలో అశోక్‌నగర్ బ్రిడ్జిని వెడల్పు చేయాలని అప్పట్లో జీహెచ్ఎంసీ అధికారులు భావించారు. రెండేళ్ల నుంచి బ్రిడ్జి వెడల్పు పనులు జరిగాయి. పనులు పూర్తి కావడంతో అదనపు రోడ్డులో వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే..

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్యవేదిక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆరె. మహేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో కూడా బీసీలకు 50 శాతం కేటాయించాలని కోరారు. ఈ మేరకు రాహుల్ గాంధీ, మేనక గాంధీ, మల్లికార్జునఖర్గేకు లేఖలు రాస్తామన్నారు. రాష్ట్ర కో-ఆర్డినేటర్ దశరథం, ప్రధానకార్యదర్శులు రాజేష్‌కుమార్, రంగు క్రాంతికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రావూరి భరద్వాజ, కాంతమ్మ స్మారక పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుయూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీ శంకర్‌కు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం, ప్రముఖ గాయని డి.సురేఖామూర్తికి రావూరి కాంతమ్మ స్మారక సంగీత సేవా పురస్కారం ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమలో ఈ పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రావూరి భరద్వాజ సాహితీసేవలు విలువైనవన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధానకార్యదర్శి డా. జె. చెన్నయ్య, రావూరి వెంకట కోటేశ్వర రావు, సైదులు పాల్గొన్నారు.



పురస్కారాలను ప్రదానం చేసిన జస్టిస్ శేషశయనారెడ్డి